క్లుప్తంగా

ఇత్తడి పసిడి కుండ సమర్పణ



కె.పెదపూడిలో మేనకేశ్వర స్వామికి సమర్పించిన ఇత్తడి పసిడి కుండ

అంబాజీపేట: కె.పెదపూడిలో వేంచేసిన పార్వతీ సమేత మేనకేశ్వర స్వామి వారి ప్రభ అలంకరణ నిమిత్తం శ్రీకృష్ణదేవరాయ యూత్ సభ్యులు ఇత్తడి పసిడి కుండను ఆదివారం సమర్పించారు. ఇత్తడి పసిడి కుండకు సంప్రోక్షణ, ప్రత్యేక పూజలు చేశారు. పసిడి కుండను చెరుకూరి నాగేంద్ర, అందె ఉమ, సూరపు సురేష్, కుంపట్ల నాయుడు, తిరుమనాథం నాయుడు, యూత్ సభ్యులు సమర్పించినట్లు అలయ అర్చకులు తెలిపారు.

ప్రభల తీర్థానికి భారీ బందోబస్తు

అంబాజీపేట: మండలంలోని మొసలపల్లి పంచాయతీ పరిధి జగ్గన్నతోటలో ఈ నెల 16న నిర్వహించే ప్రభల తీర్థానికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భారీ బందోబస్తు నియమించినట్లు ఎస్సై ఎ.చైతన్యకుమార్ తెలిపారు. ముగ్గురు సీఐలు, 11 మంది ఎస్సైలు, ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుల్స్, పోలీసులు, హోంగార్డులు 200 మందిని కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ నియమించినట్లు సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్సై ఎ.చైతన్యకుమార్ తెలిపారు. తీర్థంలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు, అల్లర్లకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తీర్థానికి వచ్చే భక్తులు ప్రభల నిర్వాహకులకు, పోలీసులకు సహకరించాలన్నారు. తీర్థంలోకి ప్రభల వెంట ఎటువంటి సినీ, రాజకీయ ఫ్లెక్సీలను తీసుకురావద్దని అలా తీసుకువస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

యువత మనోవికాసానికి క్రీడలు దోహదం



విజేతలకు బహుమతి అందిస్తున్న జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు

అయినవిల్లి: యువత మనో వికాసానికి క్రీడలు దోహదపడతాయని స్థానిక జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం సంక్రాంతి సందర్భంగా మాగంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. మాగం, విలస గ్రామాల మధ్య ఈ పోటీ నిర్వహించారు. ఈ పోటీల్లో కె.జగన్నాథపురం, అమలాపురం ఎత్తురోడ్‌కు చెందిన జట్లు తలపడ్డాయి. విన్నర్స్‌గా ఎత్తురోడ్ టీమ్, రన్నర్స్‌గా కె.జగన్నాథపురం జట్లు నిలిచాయి. ఈ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు హాజరయ్యారు. కార్యక్రమానికి మాగం సర్పంచ్ కాశి వీవీ సత్యనారాయణ, ఏఎంసీ మాజీ డైరెక్టర్ చేట్ల రామారావు విజేతలకు బహుమతి, ట్రోఫీ అందజేశారు.

జనఔషధ కేంద్రాలతో తక్కువ ధరలకే మందులు



ఉయ్యూరువారి మెరక వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో మాట్లాడుతున్న సర్పంచ్ రత్నకుమారి

సఖినేటిపల్లి: ప్రధానమంత్రి జన ఔషధ కేంద్రాల ద్వారా తక్కువ ధరలకే మందులు అందుబాటులోకి వచ్చాయని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, రాష్ట్ర కిసాన్ మోర్చా డైనేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు అన్నారు. ఆదివారం ఉయ్యూరువారి మెరక, శృంగవరప్పాడు గ్రామాల్లో అధికారులు వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాల సమావేశాలు నిర్వహించారు. ఉయ్యూరువారి మెరకలో సర్పంచ్ ఓగూరి రత్నకుమారి, శృంగవరప్పాడులో సర్పంచ్ రావి నాగవెంకట లక్ష్మీదేవి అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. శాఖల వారీగా కేంద్రం పేదలకు అమలు చేస్తున్న పథకాలను అధికారులు వివరించారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు, నాయకులు పట్టపు సూర్యప్రకాశ రావు, యెనుముల సుబ్బారావు, రుద్రరాజు సత్యనారాయణరాజు, ఈవోపీఆర్డీ కె.సూర్య నారాయణ, ఏపీవో నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మకరజ్యోతి దర్శనం

అలమూరు: స్థానిక అయ్యప్ప స్వామి ఆలయ ఆవరణలో మకర సంక్రాంతిని పురస్కరించుకుని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శబరిమల తరహాలో మకరజ్యోతి దర్శనం జరగనుందని ఆలయ కమిటీ వ్యవస్థాపకులు ఎం.ముకేందరస్వామి తెలిపారు. అనంతరం అయ్యప్పస్వామి దర్శనం అనంతరం స్థానిక నాగులచెరువులో తెప్పోత్సవం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. భక్తులందరూ ఈ కార్యక్రమాలను తిలకించి ఆధ్యాత్మికతను పొందాలని ఆయన ఆకాంక్షించారు.

ఉత్సాహంగా భోగి వేడుకలు

- పాల్గొన్న ఎమ్మెల్యేలు రాపాక, జగ్గిరెడ్డి
- ఉల్లాసంగా కోడిపందేలు ప్రారంభం



సీఆర్‌సీ సంక్రాంతి వేడుకల్లో కోడి పందేలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



మలికిపురంలో కోడి పందేలను ప్రారంభించిన ఎమ్మెల్యే రాపాక



కొమరాడలో 160 అడుగుల భోగి పిడకల దండ ఊరేగింపు

మలికిపురం: సంక్రాంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ప్రజలు ఉత్సాహంగా ఆనందోత్సాహాల మధ్య గడిపారు. ఉదయాన్నే భోగి స్నానాలు ఆచరించి భోగి మంటలు వేసుకున్నారు. గత నెల రోజులుగా శ్రమించి తయారు చేసి ఆరబెట్టిన పిడకలను భక్తిశ్రద్ధలతో భోగి మంటల్లో వేసి పూజలు చేశారు. సంప్రదాయంగా సున్నుండలు ఆరగించారు. శాఖాహార వంటలతో కుటుంబ సమేతంగా భోజనాలు ఆరగించారు. ఇక పండగ సందర్భంగా రాజోలు దీవిలో పలు గ్రామాల్లో కోడి పందేలు, గుండాటలు జోరుగా సాగాయి. మలికిపురం మండలంలో గుడిమెళ్లంక, విశ్వేశ్వరాయపురం, మట్టపర్రు, లక్కవరం, బట్టేలంక, శంకరగుప్తం, పడమటిపాలెం, సఖినేటిపల్లి మండలంలో సఖినేటిపల్లి, రామేశ్వరం, అప్పనరామునిలంక, సఖినేటిపల్లిలంక, రాజోలు మండలం బి.సావరం, పొన్నమండ, శివకోడు, చింతలపల్లి తదితర గ్రామాల్లో భారీగా సాగాయి. మలికిపురం, లక్కవరం పలు చోట్ల ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పాల్గొని ఉత్సాహపరిచారు.

సంప్రదాయబద్ధంగా సంక్రాంతి జరుపుకోవాలి

కొత్తపేట: సంక్రాంతి ఉత్సవాలు, వివిధ పోటీలు సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి పిలుపునిచ్చారు. కొత్తపేటలో సంక్రాంతి సందర్భంగా జరిగే కోడి పందేలను ఆదివారం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రారంభించారు. ముందుగా జగ్గిరెడ్డికి నిర్వాహకులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికి, కోడి పందేల ప్రాంగణానికి తోడ్కొని వచ్చారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ ప్రజానీకానికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పూర్వం నుంచీ సంక్రాంతి సందర్భంగా నిర్వహించే తెలుగు సంస్కృతీ, సంప్రదాయాల్లో కోడి పందేలు ఒక భాగమన్నారు. అయితే ఈ పందేలు ఆనందంగా తిలకించేవిగా ఉండాలన్నారు. సంక్రాంతి సందర్భంగా నిర్వహించే ప్రభల ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. ఎక్కడా ఏ చిన్న అపశృతి, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవ కమిటీలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం కోడి పుంజులను ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, అముడ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు బరిలోకి వదిలారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు కర్రి నాగిరెడ్డి, పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు గొల్లపల్లి స్వరూప్, పీఏసీఎస్ పర్సన్ దంగేటి సుబ్రహ్మణ్యం (డీఎస్), ఎంపీటీసీ దూళి సూరిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు ఇసుకపట్ల సునీల్, భీమనాదం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు: సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా భోగి పండగ ఆదివారం ప్రజల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. భోగ భాగ్యాలను కలిగించేదిగా భావించే భోగి మంటలు ప్రతి గ్రామంలోనూ సందడి చేశాయి. మండలంలోని మామిడికుదురు, నగరం, పాశర్లపూడి, మొగలికుదురు, పెదపట్నం, గెద్దాడ, అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక, పాశర్లపూడిలంక, లూటుకుర్రు, మాకనపాలెం, ఆదుర్రు, కొమరాడ, ఈదరాడ, మగటపల్లి, గోగన్నమఠం, కరవాక గ్రామాల్లో భోగి మంటలతో సందడి నెలకొంది. చిన్నా, పెద్ద తేడా లేకుండా అన్ని వయసుల వారు ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా ఈ వేడుకల్లో పాల్గొన్నారు. బాలలు, యువకులు తెల్లవారుజామున తలారా స్నానమాచరించి, నూతన దుస్తులు ధరించి భోగి మంటల్లో పిడకల దండల్ని వేసి పండగను పూర్తిగా ఆస్వాదించారు. మొగలికుదురులోని జగ్గన్నపేటలో స్థానికుల 100 అడుగుల పిడకల దండను ఊరేగించి భోగి మంటలో వేశారు. కొమరాడ పాశమ్మ అమ్మవారి వీధిలో కాపవరపు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో 160 అడుగుల భోగి పిడకల దండను ఊరేగింపుగా తీసుకు వెళ్లి భోగి మంటలో వేశారు. అప్పనపల్లి బాల బాలాజీ స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన హరిదాసు, రెండెడ్ల బండి, కోడి పుంజులు, భోగిమంట భక్తుల్ని విశేషంగా ఆకట్టుకున్నాయి.

అంబాజీపేట: అరటిపళ్ల అత్తం.. అయ్యవారి చిత్తం.. ఇచ్చినమ్మ పుణ్యం.. ఇవ్వనమ్మ పాపం.. అనే సంప్రదాయ పాట పాడుకొంటూ భోగి దుంగలు సమీకరించి ఆదివారం తెల్లవారుజామునే చిన్నారులు, యువకులు భోగి మంటలు వేశారు. చిన్నారులు తయారు చేసుకొన్న భోగి పిడకలను ఉత్సాహంతో మంటల్లో వేశారు. అంబాజీపేట, చిరతపూడి, ఇసుకపూడి, మాచవరం తదితర గ్రామాల్లో భోగి మంటలను యువకులు పెద్ద ఎత్తున వెలిగించేందుకు పోటీ పడ్డారు. అలాగే మండలంలోని ప్రధాన ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

జోరుగా కోడి పందాలు, గుండాటలు

పి.గన్నవరం: సంక్రాంతి పండుగల సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో కోడి పందేలు, గుండాటలు జోరుగా సాగుతున్నాయి. పి.గన్నవరం శివారు డీఎస్ పాలెం, జి.పెదపూడి, మానేపల్లి, వాడ్రేవుపల్లి, పోతవరంలో రెండు చోట్ల కోడి పందేలు, గుండాటలు జరుగుతున్నాయి. పందెగాళ్లతో పాటు, వీటిని తిలకించేందుకు పెద్ద ఎత్తున జనం తరలి వస్తున్నారు.

ప్రత్యేక ఆకర్షణగా భోగి దండ

అలమూరు: వివిధ గ్రామాల్లో భోగి పండగని ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. మండలంలోని గుమ్మిలేరులో రికార్డు స్థాయిలో తయారు చేసిన సుమారు 600 మీటర్ల పొడవైన భోగి దండ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్థాని శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలోను, ఉరదాలమ్మ దండు గంగమ్మ ఆలయంలోను వేద పండితుల మంత్రోచ్ఛరణల ఈ భోగి దండకు ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం ఊరేగింపుగా తీసుకు వచ్చి స్థానిక బస్టాండు సెంటర్‌లో ఏర్పాటు చేసిన భోగి మంటల్లో వేశారు. పాత చెక్కసామాను, కలప దుంగలను సేకరించి అక్కడక్కడా వేసిన భారీ భోగి మంటలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. అలాగే చిన్నారులను భోగిపళ్లతో నెత్తిన అక్షతలుగా పోసి తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు దీవెనలు అందించారు. భోగి పండగ పర్వదినాన చిన్నారులను భోగి పళ్లతో దీవిస్తే సాక్షాత్తూ ఆ భగవంతుడే వచ్చి దీవించినట్లు భక్తుల భావించడం ఆనవాయితీ. చిన్నారులు బుడి బుడి అడుగులు వేసుకుంటూ ఆవుపేడతో చేసిన పిడకలను చేతబట్టుకుని ఎర్రని భోగి మంటల్లో వేసి కేరింతలు కొట్టడం స్థానికులను ఆనందోత్సాహానికి గురిచేసింది.

సఖినేటిపల్లి: అంతర్వేది పుణ్యక్షేత్రంలో ఆదివారం భోగి పురస్కరించుకుని ఆలయ ఏసీ వి.సత్యనారాయణ పర్యవేక్షణలో పండగ సంబరాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భోగి మంటలో స్థానికులు పిల్లలతో భోగి పిడకల దండలు వేయించారు. అలాగే ప్రాంగణాన్ని అందమైన ముగ్గులతో భక్తులు తీర్చిదిద్దారు. తొలుత భోగి మంట వద్ద ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామ రంగాచార్యులు పూజలు నిర్వహించారు. ఆలయ సిబ్బంది, భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

సీఆర్‌సీలో సంక్రాంతి సంబరాలు

రావులపాలెం: సంక్రాంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కోడి పందేల బరులను ఆదివారం ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రారంభించారు. పార్కు వద్ద సీఆర్‌సీ సంప్రదాయ కోడి పందాలతో పాటు, వెదిరేశ్వరం రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన బరులను ఎమ్మెల్యే జగ్గిరెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కోడి పుంజులతో పందేలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తరతరాలుగా నిర్వహిస్తున్న సంప్రదాయ పోటీలను కచ్చితంగా నిర్వహించి తీరుతామని ఎక్కడో జరిగిన ఘటనలు దృష్టిలో ఉంచుకుని సంప్రదాయంగా వస్తున్న పోటీలకు అడ్డంకులు సృష్టించవద్దని పోలీసులను కోరారు. అనుచిత సంఘటనలు జరగకుండా కోడి పందాలను సజావుగా నిర్వహించాలని సూచించారు.



అంబాజీపేటలో భోగి మంట వెలిగిస్తున్న యువకులు



అంతర్వేది ఆలయ ప్రాంగణంలో భోగి మంట



గుమ్మిలేరులో 600 అడుగుల భోగి దండ

వాడపల్లిలో సంక్రాంతి సంబరాలు



వాడపల్లి ఆలయం వద్ద భోగి మంటతో సంబరాలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో సంక్రాంతి సంబరాలను కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ప్రారంభించారు. తొలుత ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భోగి మంటలు వెలిగించి సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. సంక్రాంతి సంప్రదాయాలతో ఎడ్ల బండ్లు, వివిధ రకాల సంప్రదాయ పద్ధతులతో సంక్రాంతి సంబరాలు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, ఎల్లప్పుడూ సంతోషాలు ఉండాలని పేర్కొన్నారు. తొలుత ఎమ్మెల్యేకి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ ప్రాంగణం బంతి, చామంతులతో పాటు ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. తిరుమలేశుని ఆలయం మాదిరిగానే ఆలయాన్ని పుష్పాలతో అలంకరించి అద్భుతంగా తీర్చిదిద్దారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

సంప్రదాయాలను భావితరాలకు అందించాలి

అలమూరు: సనాతన సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తూ 30 యేళ్ల నుంచి ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్న అయ్యప్పస్వామి ఆలయ కమిటీ కృషి అభినందనీయమని కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. స్థానిక ఆలయ ఆవరణలో అయ్యప్ప కమిటీ నిర్వహించిన రంగవల్లుల పోటీల విజేతలకు, ప్రతిభావంతులకు ఆదివారం బహుమతుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆలయ కమిటీ చైర్మన్ వైట్ల సత్యనారాయణమూర్తి అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పాల్గొని ప్రసంగించారు. నాటి ఆచార వ్యవహారాలను, ఆధ్యాత్మికతను భావితరాలకు అందించాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం మండల స్థాయిలో నిర్వహించిన వివిధ పోటీల విజేతలతో పాటు భజన మండళ్ల సభ్యులకు, పదో తరగతిలో ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి బహుమతులను అందజేశారు. రావులపాలెం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కర్రి నాగిరెడ్డి, మండల వైస్ ఎంపీపీ వాసంశెట్టి దుర్గాభవాని, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు వంటిపల్లి సతీష్, నార్కెడిమిల్లి వెంకన్నబాబు పాల్గొన్నారు.

వైభవంగా ప్రభల ఉత్సవం



కొత్తపేట కొప్పిశెట్టివారివీధిలో ప్రభల ఉత్సవం

కొత్తపేట: స్థానిక కొప్పిశెట్టివారి వీధిలో ఆదివారం భోగి, ప్రభల ఉత్సవం వైభవంగా నిర్వహించారు. సంక్రాంతి ప్రభల ఉత్సవానికి కొత్తపేట పెట్టింది పేరు. అన్ని చోట్లా కనుమ రోజున ప్రభల ఉత్సవాలు జరుగుతుండగా కొత్తపేటలో మాత్రం ఆనవాయితీగా సంక్రాంతి రోజున జరుగుతున్న విషయం తెలిసిందే. కాగా ఈ ఉత్సవాలను ఆదర్శంగా తీసుకుని స్థానిక కొప్పిశెట్టివారివీధి యువత ఈ ఏడాది మరో రోజు ముందుగానే భోగి పండగ నాడు ప్రభల ఉత్సవం నిర్వహించారు. యువజన నాయకులు రాయుడు శ్రీను, కొప్పిశెట్టి వాసు తదితర యువకుల ఆధ్వర్యంలో ఉదయం రామాలయం, లక్ష్మీగణపతి ఆలయం, చిరు బంగారమ్మతల్లి ఆలయం వద్ద భారీ ఎత్తున భోగి మంట వేశారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మూడు ప్రభలను తయారుచేసి గరగ నృత్యం, కోలాటం, బ్యాండు వాయిద్యాల నడుమ ప్రభల ఊరేగింపు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ ఎత్తున అన్నసమారాధన జరిపారు. అనంతరం మహిళలు, యువతులతో గొబ్బెమ్మల ఉత్సవం, బాలలకు భోగిపళ్లు పోశారు. రాత్రి బాణసంచా కాల్చారు. స్థానిక, స్థానికేతర ప్రాంతాల్లో స్థిరపడిన కొప్పిశెట్టివారి వీధి గ్రామస్తులు తరలివచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా గొబ్బెమ్మల వేడుకలు



కొత్తపేటలో గొబ్బెమ్మల ఉత్సవం సందర్భంగా పూజలు నిర్వహిస్తున్న మహిళలు, బాలికలు

కొత్తపేట: ధనుర్మాసంలో సంక్రాంతి ముందు మహిళలు, బాలికలు గొబ్బెమ్మల వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీ. భోగి పండగ సందర్భంగా ఎక్కడికక్కడ మహిళలు, యువతులు, బాలికలు ఆదివారం గొబ్బెమ్మల ఉత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. దానిలో భాగంగా స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలో కొత్తపేట కాపునాడు ప్రధాన కార్యదర్శి సలాది సూర్యనారాయణ స్వగృహం వద్ద ఆయన కుమార్తెలు ప్రసన్న, రోజా, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో గొబ్బెమ్మల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఆ వీధిలో మహిళలు, బాలికలు పాల్గొన్నారు. రంగుల ముగ్గుల మధ్య శ్రీకృష్ణుని ప్రతిమను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గొబ్బి మహాగౌరీ దేవిని ఆహ్వానిస్తూ బాలికలు నృత్యం చేవారు. పెద్దలు బాలికలను ఆశీర్వదించారు. అనంతరం బాలికకు భోగిపళ్లు పోసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ తాంబూలాలు పంచారు.

బుల్లితెర నటుడు కల్కి రాజా సందడి



పాశర్లపూడిలంకలో భోగి మంట వద్ద కల్కి కుటుంబ సభ్యుల సందడి

మామిడికుదురు: బుల్లితెర నటుడు కల్కి రాజా ఆదివారం తన స్వగ్రామం పాశర్లపూడి లంకలో సందడి చేశారు. పాశర్లపూడిలంక సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశ రావు కుమారుడైన కల్కి రాజా తన కుటుంబ సభ్యులతో కలసి సంప్రదాయ దుస్తులతో భోగి మంట వెలిగించి, ఆవు పేడతో తయారు చేసిన పిడకల దండలు మంటలో వేసి సందడి చేశారు. మహిళలు చీర కట్టులో దాండియా ఆడారు. సంక్రాంతి పండగకు వన్నె తెచ్చే చెరుకుగడలు, పాడి కుండలు, తదితర వాటిని ఏర్పాటు చేసి సంక్రాంతి పండగను ఘనంగా నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజలు పట్టణ ప్రాంతాలకు వలస వెళ్లి మన పురాతన సంస్కృతి, సంప్రదాయాలను మర్చిపోతున్నారని వాటిని నేటి తరానికి గుర్తుచేయాలన్న ఉద్దేశంతోనే సంక్రాంతి పండగను ఘనంగా నిర్వహిస్తున్నామని కల్కి రాజా పేర్కొన్నారు. సంక్రాంతి పండగ కోసం తమ బంధువులు ఒమన్, డెన్మార్క్‌ల నుంచి వచ్చారని చెప్పారు.

గోదాదేవికి బంగారు ఆభరణాల సమర్పణ



అమ్మవార్లకు బంగారు సూత్రాలు సమర్పిస్తున్న రాంబాబు దంపతులు

పి.గన్నవరం: పోతవరంలో వేంచేసిన శ్రీ, భూ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఆదివారం గోదాదేవి కల్యాణం వైభవంగా నిర్వహించారు. పి.గన్నవరం గ్రామానికి చెందిన అడ్డగళ్ల వెంకట జయ రాంబాబు, విజయలక్ష్మి దంపతులు అమ్మవార్లకు బంగారు సూత్రాలు సమర్పించారు. అలాగే పోతవరానికి చెందిన కొప్పాడి సత్యనారాయణ, కారుణ్య దంపతులు వినాయకునికి వెండి కిరీటం సమర్పించారు. జయ రాంబాబు దంపతులు భక్తులకు అన్న సమారాధన చేశారు. ఆలయ ధర్మకర్త పినపోతు త్రినాథ వరప్రసాద్ కార్యక్రమాలకు ఆధ్వర్యం వహించారు.

వైభవంగా గోదాదేవి కల్యాణం

అంబాజీపేట: స్థానిక పెద్దవీధిలో వేంచేసిన సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన గోదాదేవి రంగనాథుల కళ్యాణం వైభవంగా జరిగింది. ధనుర్మాస వ్రతానంతరం జగత్కల్యాణ కారకులైన గోదాదేవి రంగనాథులకు కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు ఖండవల్లి బదరీ నారాయణాచార్యులు తెలిపారు. పి.గోపాలచార్యుల బ్రహ్మత్వంలో నారాయణచార్యుల ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

ఆనాటి హృదయాల ఆనంద గీతం



పుల్లేటికుర్రు జెడ్పీ హైస్కూల్‌లో ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు



తాటిపాకలో కలసిన పూర్వ విద్యార్థులు

అంబాజీపేట: భోగి మంటల్లా కల్మషం లేని పలకరింపులు.. సంక్రాంతి సరదా ముచ్చట్లు.. ఘాటైన ఘుమఘుమలు పసందైన రుచులు.. ఇంద్రధనస్సులా క్షణక్షణ హరివిల్లు.. ఆప్యాయతల పొదరిల్లుపై రంగవల్లిలాంటి అనురాగాలు.. పూర్వ ఆత్మీయ సమ్మేళనంలో కనిపించిన దృశ్యాలు. పుల్లేటికుర్రు జెడ్పీ హైస్కూలులో 1998–99లో పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఘనంగా నిర్వహించిన పూర్వ విద్యార్థుల అపూర్వ కలయికతో కలుసుకున్నారు. 25 ఏళ్ల ఆనాటి అనుభూతులను ఒకరికొకరు గుర్తు చేసుకుని నెమరు వేసుకున్నారు. బాల్యంలో చేసిన చిలిపి చేష్టలు.. చెట్ల కింద చదువులు, గత జ్ఞాపకాలు, సరదాలు, షికార్లు.. ఆపద సమయంలో ఆపన్న హస్తం అందించిన తోటి మిత్రుల మరుపురాని ఘటనలతో ఒక్కసారిగా గుర్తుకు రావడంతో పూర్వ విద్యార్థులు పులకరించిపోయారు. తమకు చదువుచెప్పిన 22 మంది గురువులను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. తోటి విద్యార్థులు నలుగురు మృతి చెందడంతో ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున రూ.80 వేలను ఆర్థికసాయం అందించినట్లు విద్యార్థులు తెలిపారు. అలాగే నేదునూరి ఏసమ్మ కుమారుడు జశ్వంత్ అగ్నిప్రమాదంలో గాయపడటంతో రూ.80 వేలు, ఫిక్సిడ్ డిపాజిట్ కింద రూ.50 వేల నగదు అందించారు. అంతకుముందు భోగి మంటలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులంతా చిన్న పిల్లల్లా మారిపోయి సరదా సరదాగా గడిపారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

రాజోలు: తాటిపాక ఉన్నత పాఠశాల 1996–97 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక పాఠశాలలో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని చదువుకున్న రోజులను గుర్తు చేసుకుని మురిసిపోయారు. చాలా మంది సుదూర ప్రాంతాల్లో ఉద్యోగరీత్యా స్థిరపడిపోయారని, కొందరు స్వగ్రామంలోని వ్యాపారం, వ్యవసాయం చేసుకుంటున్నారని బొంతు రమేష్ వివరించారు. వాట్సాప్, ఫేస్‌బుక్ ద్వారా స్నేహితులందరిని ఒక చోటల కలిసేలా సంయుక్త కృషి చేశామన్నారు.